
కథ

# నీలాగే నేనూ!

కలిదిండి వెంకట సుబ్రహ్మణ్య వర్మ
98487 87266



'ఏం టీ కాగితాలు?' అనుకుంటూ చూశాను. మాసిపోయి ఉన్నాయి. ఎప్పుడో నలభై – యాభై ఏళ్ల క్రితం ఆ పెట్టెలో పెట్టినట్టున్నాను. నాకు కొందరు ఇచ్చిన బహుమతుల్ని అందులో దాచుకున్నాను. ఈవేళ వాటినోసారి చూద్దామనిపించింది. పెట్టె తెరిచి, ఒక్కోదాన్నీ చూస్తుంటే.. అన్నిటికంటే దిగువన ఈ కాగితాలు ఉన్నాయి. అవేంటో చూద్దామని, మొదటి పేరా చదవగానే.. అదో కథ అని అర్థమయింది. మరికొంత చదివాక, అది నేను రాసిందేనని అనిపించింది.

అది కథేనా? ఎవరన్నా చదివితే అది కథే! నాకు మాత్రం.. నా జీవితానుభవంలోని కొన్ని సంఘటనలు. అయితే నేను రాసినవేంటో నాకు అంతగా గుర్తు లేవు కాబట్టి.. అదిప్పుడు నాకు కూడా కథే! చాలా మంది బతుకులు కాస్త అటోఇటో ఒకలాగే ఉంటాయి. మేం వారికంటే భిన్నం. మళ్లీ మా జీవితాలు కూడా ఒకలాగే ఉంటాయి. అలాగని అవి అన్నీ అలాగే లేవు. కొన్ని మారాయి. కొన్ని మాత్రం అవకాశం లేక మారకుండా ఉండిపోయాయి.

కళ్లజోడు సవరించుకుని, మొదటి పేజీ చదివేటప్పటికి నేను రాసినవేంటో లీలగా నా మనసులో మెదిలాయి. ఎనిమిదో తరగతి చదువుతున్న మనవడు ప్రతిభామూర్తిని రోజూ ఆఫీసునుంచి వచ్చేటప్పుడు మా అమ్మాయి తీసుకువస్తుంది. ఇంకా గంటకు పైగా టైముంది. అందుకే.. ఆ కాగితాల మీదే దృష్టి పెట్టాను.

* * *

నా పేరు లలిత.. మాది కళావంతుల కుటుంబం. భోగంవాళ్లనీ అంటారు. అయినప్పటికీ నేను మా ఊళ్లో టెన్త్ క్లాసు వరకూ చదువుకున్నాను. స్కూల్ ఫైనల్ కూడా చదివేదాన్నే కానీ, మా అమ్మ మాన్పించేసింది. అప్పటికే నేను పుష్పవతినై ఓ సంవత్సరం దాటిపోయింది. నన్ను చూసిన కొందరు కన్నెరికం చేయడానికి తహతహలాడుతూ మా అమ్మకు కబురు మీద కబురు పెట్టడంతో..

''చదువింక చాల్లే!'' అనేసింది.

నేనూ ఇంకా చదువుతానని అనలేదు. ఎందుకంటే మా ఇంట్లో నాకంటే పెద్దదైన సుజాతక్కనూ, మా దూరపు చుట్టం విజయ వదిననూ చూస్తుంటే నాకూ వాళ్లలా మంచిమంచి చీరలు కట్టుకుని, బాగా ముస్తాబయి, సెంటు రాసుకుని సరదా పడదామని అప్పుడప్పుడూ అనిపించేది. ఇక స్కూలు మానేశానంటే.. వాళ్లలాగే సరదాగా ఉండొచ్చనిపించేది.

మా అమ్మ కాంతమ్మ దగ్గరికి తరచూ వచ్చే పెదరాజు గారు వేళాకోళాలాడుతుంటే నాకు సరదాగా అనిపించేది. బాగా చిన్నప్పుడు ఆయనగారింటికి అప్పుడప్పుడూ మా అమ్మమ్మతో వెళ్లేదాన్ని. పెదరాజుగారి భార్య బంగారం బొమ్మలా మెరిసిపోతుండేది. ఆమెకు అంతా తెలిసినా.. మా అమ్మమ్మతో అభిమానంగానే మాట్లాడేది.

''ఇదిగో! బెల్లపావకాయ. నీకిష్టం కదా పట్టుకెళ్లు!'' అంటూ ఓ గిన్నెలో పెట్టి ఇచ్చేదావిడ.

నాకు సున్నుండో మిఠాయి ఉండో ఇచ్చేవారు. నాకు కాస్త ఊహ కలిగాక, అంత అందమైన భార్య ఉండగా ఆయనకు మా అమ్మ ఎందుకు కావాల్సి వచ్చిందో అనిపించేది. మా అమ్మ చామనఛాయ రంగు. కళ ఉన్న మొహం. తన ఒంటివాటం చూడగానే ఏ మగాడికైనా మోహం కలిగి తీరుతుందని తర్వాత్తర్వాత నాకు తెలిసి వచ్చింది. ఇంట్లో కుదరనివి కొన్ని మా దగ్గర దొరుకుతాయని కూడా మేమంటే మోజు పడతారని నాకు అర్థమైంది. అప్పట్లో ముండల దగ్గరికి వెళ్లడం తప్పుగా అనుకునేవారు కాదు. కొందరు ఎవరో ఒకరిని ఉంచుకునేవారు. అదో స్టేటస్ సింబల్ అట. తాగడం చాలా తప్పుగా భావించడమే కాకుండా.. తాగేవాళ్లను భయం భయంగా కూడా చూసేవారు. దాంతో తాగుబోతులు పెద్దగా ఉండేవారు కారు.

ఓరోజు మంచి ముహూర్తం చూసి.. నాకు మా ఊరు పెదకాపుగారి కొడుకుతో కన్నెరికం చేయించారు. అప్పట్లోనే వెయ్యి నూట పదహార్లు ఇచ్చాడాయన. అది చాలా పెద్ద మొత్తం అట. మొదట్లో తరచూ వచ్చేవాడాయన. తర్వాత మరొకడు, మరొకడు వచ్చినప్పుడు వాళ్లతో గడపడానికి నాకేదోలా అనిపించేది. అందరిదీ ఒకటే యావ. నెమ్మదిగా అలవాటు పడ్డాను.

ఒకనాడు మూర్తి అనే ఆయన వచ్చాడు. నాతో చాలా అభిమానంగా ఉన్నాడు. గౌరవంగా చూశాడు. అలాంటి వాణ్ని చూడ్డం నాకు అదే మొదటిసారి. ఏదో ఆబగా వచ్చి వెళ్లిపోవడం కాకుండా.. ఏవేవో కబుర్లు చెబుతూ, జోకులు వేస్తూ ఉండేవాడు. ఎప్పుడూ అతనితోనే ఉండిపోతే బావుండుననిపించేది. అయితే, అతను కొన్నిరోజులు పూర్తిగా నాతోనే ఉండి వెళ్లాక.. మళ్లీ ఎన్నాళ్లకో ఊడిపడేవాడు. కథలు చెప్పేవాడు. తను చూసిన కొత్త సినిమాల గురించి చెప్పేవాడు. మా పిఠాపురంలో రెండే సినిమా హాళ్లుండేవి. సెకండ్ రిలీజ్ సినిమాలే వచ్చేవి.

కొందరు వాళ్ల పని చేసుకుని వెళ్లిపోయేవారు. కొందరు తామెంతో గొప్పవాళ్లమనుకుంటూ నన్ను చిన్నచూపు చూస్తున్నారనిపించేది.. వాళ్ల మాటలు చూసి. అలాంటప్పుడు ఎలాంటి బెదురూ లేకుండా నేననుకున్నది అనేసేదాన్ని.

ఒకనాడు ఒకతను వచ్చాడు. అతని పేరు గోపాలరావట.

''నువ్వీ మురికికూపంలో ఎందుకుంటున్నావ్. ఎవరైనా పెళ్లాడతానంటే చేసుకుంటావా?'' అని అడిగాడు. నేను నవ్వుకున్నాను. ఇలా చాలామంది చాలాసార్లు అడిగారు నన్ను.

ఒకనాడు ఏదో పత్రిక నాకిస్తూ.. అందులోని ఓ కథ చదవమన్నాడు. చదివాను. అది ఓ వేశ్య కథ. ఒక ఆదర్శవాది ఆమెను వివాహం చేసుకుని సంఘ సంస్కర్తగా పేరు తెచ్చుకుంటాడు. నన్నూ అలాగే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. తనకు ఇదివరకే పెళ్లయిందనీ, తన భార్య శీలం మంచిది కాదని వదిలేశాననీ చెప్పాడు.

''మరి మీ శీలం మంచిదా?'' అని నేను అడిగితే..

''నేను మగాణ్ని!'' అని సమాధానమిచ్చాడు.

అందుకే..

''మిమ్మల్ని నేను చేసుకోలేను. రేపు మాత్రం నన్ను వదిలెయ్యరని ఏముంది? అయినా నాకీ బతుకు బాగానే ఉంది'' అని చెప్పాను.

తర్వాత గోపాలరావు నా దగ్గరికి రావడం మానేశాడు. నేనూ అతణ్ని మర్చిపోయాను. అయితే, మొన్నీమధ్య మా సుజాతక్క దగ్గరికెళ్లడం చూశాను. నేనేమీ బాధపడిపోలేదు. ఆమె మా పినతల్లి కూతురు. మా ఇంట్లో వయసులో ఉన్నవాళ్లం ముగ్గురం ఉన్నాం. మరొకరు.. విజయ వదిన. మాది వంశపారంపర్య వృత్తి కావడం వల్ల.. ఊళ్లో పెద్దవాళ్ల అండ కూడా ఉండటం వల్ల.. ఎవరూ మమ్మల్ని చిన్నచూపు చూసేవారు కారు. పోలీసుల బెడదా ఉండేది కాదు.

శ్యామలరావు అనే మా పక్కూరి వెలమ దొర కొడుకు సుజాతక్కను పెళ్లి చేసుకుంటానంటే..